క్లుప్తంగా

వేణుగోపాలస్వామి సేవలో అభినయ్


శ్రీవేణుగోపాలస్వామి సేవలో దర్శించుకున్న తిరుపతి డిప్యూటీ మేయర్ అభినయ్‌రెడ్డి

కార్వేటినగరం: మండల కేంద్రంలో వెలసిన రుక్మిణీ, సత్యభామ సమేత శ్రీవేణుగోపాల స్వామివారిని శుక్రవారం తిరుపతి డిప్యూటీ మేయర్ భూమన అభినయరెడ్డి దర్శించుకున్నారు. ఆలయంలో ప్రత్యేక పూజలు అభిషేకాలు నిర్వహించిన అనంతరం ఆయనకు వేద పండితులు ఆశీర్వచనలు, స్వామి వారి తీర్థ ప్రసాదాలను అందించారు. ఆయన వెంట వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి చిరంజీవి రెడ్డి, శ్రీనివాసులురెడ్డి, సాయికుమార్, నాగయ్య, టీటీడీ సిబ్బంది పలువురు ఉన్నారు.

గృహ నిర్మాణ పనులు వేగవంతం


మాట్లాడుతున్న ఎంపీడీఓ శ్రీనివాసన్

పాలసముద్రం: మండల పరిధిలో గృహ నిర్మాణ పనులను వేగవంతం చేయాలని ఎంపీడీఓ శ్రీనివాసన్ తెలిపారు. బాలక్రిష్ణాపురం గ్రామ సచివాలయంలో శుక్రవారం సచివాలయ సిబ్బందితో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్రభుత్వం గృహ నిర్మాణాలు నిర్మించుకోవడానికి ఒక్కొక్కరికి రూ.1.8 లక్షలు ఉచితంగా ఇస్తోందని చెప్పారు. బస్తా రూ.245 చొప్పున 90 బస్తాల సిమెంట్, ఉచితంగా ఇసుక, సకాలంలో బిల్లులు లబ్ధిదారులు అందజేస్తున్న గృహ నిర్మాణ పనులు ఆలస్యం అవుతుందని తెలిపారు. కార్యక్రమంలో మండల విస్తరణాధికారి రమేష్ పాల్గొన్నారు.

వీర బ్రహ్మేంద్రస్వామి కల్యాణోత్సవం రేపు


సమావేశంలో మాట్లాడుతున్న సంఘ సభ్యులు

చిత్తూరు రూరల్: తిరుపతి మహతి ఆడిటోరియంలో వీరబ్రహ్మేందస్వామి గోవింద మాంబల కల్యాణోత్సవాన్ని ఆదివారం నిర్వహించనున్నట్లు చిత్తూరు స్వర్ణకార సంఘం, విశ్వబ్రహ్మణ సంఘ సభ్యులు తెలిపారు. నగరంలోని ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం వారు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఆదివారం ఉదయం 7 గంటలకు తిరుపతి మహతి ఆడిటోరియంలో కల్యాణోత్సవం ప్రారంభమవుతుందన్నారు. పతాకావిష్కరణ, హోమం, కలశాభిషేక పూజలు జరుగుతాయన్నారు. 12 గంటలకు తిరుకల్యాణం, 4 గంటలకు ఉపన్యాసం ప్రారంభమవుతుందన్నారు. భక్తులందరూ పాల్గొన్ని ఈ మహోత్సవాన్ని జయప్రదం చేయాలని కోరారు. సమావేశంలో చంద్రశేఖర్ ఆచారి, శీతాపతి, శివకుమార్, రవి, సురేష్, విజయ, శరవణ తదితరులు పాల్గొన్నారు.

ఈ మహిళ ఎవరో?


స్పృహ తప్పి పడిపోయిన మహిళ

యాదమరి: గుర్తు తెలియని మహిళ అస్వస్థతకు గురైన సంఘటన మండలంలోని కమ్మరాయని మిట్ట గ్రామంలో చోటుచేసుకుంది. ఎస్ఐ సుమన్ కథనం మేరకు చిత్తూరు వైపు నుంచి 40 ఏళ్ల మహిళ నడుచుకుంటూ యాదమరి వైపు బయల్దేరింది. శుక్రవారం ఉదయం కమ్మరాయని మిట్ట వద్ద కళ్లుతిరిగి పడిపోయింది. స్థానికులు గుర్తించి, ఆమెను వెంటనే చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. కానీ ఇప్పటివరకు ఆ మహిళ మాట్లాడడం లేదు. ఆ మహిళను ఎవరైనా గుర్తుపడితే 9440900684ను సంప్రదించాలని ఎస్ఐ కోరారు.

నేత్రపర్వంగా పుష్పపల్లకి



చిత్తూరు రూరల్: గంగజాతరను పురస్కరించుకుని చిత్తూరు నగరంలోని శ్రీదుర్గాంబ దేవస్థానంలో శుక్రవారం పుష్పపల్లకి సేవను నేత్రపర్వంగా నిర్వహించారు. వేకువజామున మూలస్థానంలోని అమ్మవారికి అభిషేక పూజలు చేశారు. ఉదయం భక్తులచే 1008 బిందెలతో మహాజలాభిషేకం చేశారు. సాయంత్రం దుర్గమ్మకు విశేష పూజల అనంతరం వివిధ రకాల పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించిన పుష్పపల్లకిలో అమ్మవారిని ఆశీనులు చేసి నగర వీధుల్లో ఊరేగించారు. ఊరేగింపుగా వస్తున్న అమ్మవారు భక్తులకు కటాక్షిస్తూ కనువిందు చేశారు. భక్తులు కర్పూర హారతులు పట్టి మొక్కులు చెల్లించారు.

ప్రజా సంక్షేమానికి నీరాజనం

- ప్రతి ఇంటికీ రూ.లక్ష నుంచి 5లక్షల లబ్ధి
- డిప్యూటీ సీఎం నారాయణస్వామి


లబ్ధిదారులతో మాట్లాడుతున్న ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి

గంగాధరనెల్లూరు (కార్వేటినగరం): వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు ప్రజలు నీరాజనాలు పలుకుతున్నారని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కళత్తూరు నారాయణస్వామి అన్నారు. శుక్రవారం మండలంలోని కోటాగరం, కోటాగరం దళితవాడ, ఎట్టేరీ గ్రామాల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని డిప్యూటీ సీఎం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రజలను పలకరించారు. ఆయా కుటుంబాలు పొందిన సంక్షేమ లబ్ధిని బుక్‌లెట్లతో వివరించారు.

డిప్యూటీ సీఎం దృష్టికి సమస్యలు

ఆయా గ్రామాల ప్రజలు వివిధ సమస్యలను డిప్యూటీ సీఎం దృష్టికి తీసుకువచ్చారు. మురుగు కాలువలు నిర్మించాలని, ఇళ్లపై వెళ్తున్న విద్యుత్‌తీగలను మార్చాలని, గతంలో అసంపూర్తిగా నిలిచిపోయిన ఇళ్లకు బిల్లులు మంజూరు చేయాలని, ఇళ్ల పట్టాలు ఇవ్వాలని కోరారు. ఆయా సమస్యలను సంబంధిత అధికారులు పరిష్కరించాలని ఆయన ఆదేశించారు. అలాగే కొత్తగా వివాహం చేసుకున్న వారిని గుర్తించి, వారికి రేషన్ కార్డులు మంజూరు చేసి, అర్హులైన వారికి ఇంటి పట్టాలు మంజూరు చేయాలని ఆదేశించారు. కోటాగరం దళితవాడకు చెందిన సుబ్రమణ్యం(72) కిడ్నీవ్యాధితో బాధపడుతున్నట్లు మంత్రికి వివరించడంతో రూ.10 వేలు పింఛన్ అందేలా చూడాలని తహసీల్దార్‌ను ఆదేశించారు.

అడవి కొట్టురాజు అభిమానం ఎంతో గొప్పది


బైక్ యాత్ర చేస్తున్న అడవి కొట్టురాజును అభినందిస్తున్న డిప్యూటీ సీఎం

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 2024 ఎన్నికల్లో మళ్లీ ముఖ్యమంత్రి కావాలని ఉదయగిరి నియోజకవర్గం జలదంక మండలం అన్నవరం గ్రామానికి చెందిన అడవి కొట్టురాజు 175 నియోజకవర్గాల్లో జగనన్న ఫొటోతో 'జగనన్నే మా భవిష్యత్తు–మా నమ్మకం నువ్వే జగన్' కార్యక్రమంపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ బైక్ ర్యాలీ చేయడం ఎంతో అభినందనీయమని కొనియాడారు. చరిత్రలో నిలిచిపోయే సంక్షేమ పథకాలు అందిస్తున్న జగనన్న విజయానికి స్వచ్ఛందంగా అభిమానులు పాదయాత్రలు, బైక్ యాత్రలు చేస్తున్నారని మంత్రి చెప్పారు. అనంతరం అడవికొట్టు రాజుకు శాలువ కప్పి సన్మానించారు. ఎంపీపీ అనిత, వైస్ ఎంపీపీ హరిబాబు, పార్టీ మండల కన్వీనర్ పూర్ణ చంద్రారెడ్డి, సర్పంచ్ లత, నాయకులు చైతన్యరెడ్డి, సురేంద్రరెడ్డి, గుణశేఖర్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, క్రిష్ణారెడ్డి, రాజేష్‌రెడ్డి, మోజెస్, రఘునాథరెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

సైన్స్‌పై విద్యార్థులకు అవగాహన


అవగాహన కల్పిస్తున్న ఉపాధ్యాయులు

నింద్ర: విద్యార్థులు సైన్స్‌పై అవగాహన కలిగి ఉండాలని ఎంఈఓ నారాయణ అన్నారు. శుక్రవారం నింద్ర, అరూరు, అత్తూరు జిల్లా ఉన్నత పాఠశాల విద్యార్థులకు సైన్స్ ప్రయోగాల మొబైల్ యాక్టివిటీ ల్యాబ్‌ను నింద్రలో ప్రారంభించారు. 6 నుంచి 9వ తరగతి చదివే విద్యార్థుల సౌకర్యార్థం కుప్పం అగస్త్య ఇంటర్నేషనల్ ఫౌండేషన్ ఈ ల్యాబ్‌ను ఏర్పాటు చేయడం ఆనందంగా ఉందన్నారు. 60 మందిపిల్లలకు ఎంతో ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో అగస్త్య రిసోర్స్ పర్సన్ హంసగిరి, ప్రవీణ్, భవానీశంకర్, హెడ్మాస్టర్ శివయ్య, బాల సుబ్రమణ్యం, గిరిజావతి, ఉపాధ్యాయులు సురేష్, బాబు, సురేష్, ఉదయ్, బాలాజి పాల్గొన్నారు.

బోరు మోటార్లకు మరమ్మతులు


మోటారు మరమ్మతు చేయిస్తున్న అధికారులు

వెదురుకుప్పం: మండల కేంద్రంలో ఇటీవల పిడుగు పాటుకు కాలిపోయిన బోరు మోటార్లను మరమ్మతు చేసినట్లు ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ తిమ్మరాజు తెలిపారు. వెదురుకుప్పం గ్రామం, వెదురుకుప్పం ఎస్టీ కాలనీ, వెదురుకుప్పం తూర్పు దళితవాడ, భారతం మిట్ట ఆవరణలో ఉన్న బోరు మోటార్లు పిడుగు పాటుకు కాలిపోయాయి. ఒకేసారి నాలుగు మోటార్లు కాలిపోవడంతో నీటి సమస్య జఠిలమైంది. దీంతో స్థానిక సర్పంచ్ శిల్ప, అధికారులు సకాలంలో స్పందించి బోరు మోటార్లను మరమ్మతు చేసి కొత్తగా కేబుల్ అమర్చి సమస్యను పరిష్కరించారు.

'పుచ్చలపల్లి'కి ఘన నివాళి


పుత్తూరులో నివాళులర్పిస్తున్న సమాచార హక్కుల వేదిక సభ్యులు

పుత్తూరు రూరల్: పట్టణంలోని సుందరయ్య నగర్‌లో శుక్రవారం సమాచార హక్కుల వేదిక సంఘం కార్యదర్శి వర్గ సభ్యురాలు హేమలత అధ్యక్షతన కమ్యూనిస్టు ఉద్యమనేత పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతి నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. సంఘ కార్యదర్శి కె.మురగారెడ్డి మాట్లాడుతూ, బడుగు, బలహీన వర్గాల పక్షాన పోరాటం చేసిన సీపీఎం పార్టీలో సుందరయ్య పాత్ర ఎంతో ప్రత్యేకమని చెప్పారు. ఆయన చూపిన చొరవ, తెగువ కారణంగానే భారత కమ్యూనిస్టు (మార్కిస్ట్) పార్టీ ఏర్పాటైందన్నారు. తెలంగాణ రైతాంగ పోరాటానికి ఆయన చేసిన సేవ మరువలేమన్నారు. కార్మికులు, రైతుల అభ్యున్నతికి ఆయన చేసిన కృషి చిరస్మరణీయమని కొనియాడారు. కార్యక్రమంలో షేర్ ఆటో యూనియన్ నాయకులు లక్ష్మీపతి, దత్తాత్రేయ, మోహన్, సుభద్రమ్మ, అమరావతి తదితరులు పాల్గొన్నారు

అంబేడ్కర్ సర్కిల్ వద్ద..

సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో అంబేడ్కర్ సర్కిల్ వద్ద సుందరయ్య చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. సీపీఎం నాయకులు వెంకటేష్, విజయ్, శివ, కృష్ణమూర్తి, పురుషోత్తం పాల్గొన్నారు.

ప్రభుత్వ బడుల్లోనే చేర్పించండి


తల్లిదండ్రుల అవగాహన కల్పిస్తున్న హెచ్‌ఎం

పాలసముద్రం: ప్రైవేటు స్కూళ్లకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో బోధన కొనసాగుతోందని, పిల్లలను సర్కారు బడుల్లోనే చేర్పించాలని అముదాల జెడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం గణపతి తల్లిదండ్రులను కోరారు. ఆయన శుక్రవారం అముదాల, ఎల్ఎన్‌పురం, రంగాపురం, గొల్లకండ్రిగ గ్రామాల్లో బడీడు పిల్లల తల్లిదండ్రులతో మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా వసతులు అందుబాటులో ఉన్నాయని, ఉచితంగా పుస్తకాలు, యూనిఫాం, బూట్లు ఇస్తారని చెప్పారు. గ్రామీణ ప్రజలకు ప్రతి రోజు పనులకు వెళ్లి కష్టపడి సంపాదించిన డబ్బును ప్రైవేటు స్కూళ్లకు దారపోస్తున్నారని గుర్తు చేశారు. ఈసారి విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని అవగాహన కల్పించారు.

ఉపాధి కూలీలతో ఏపీఓ సమీక్ష


ఉపాధి హామీ కూలీలతో మాట్లాడుతున్న ఏపీఓ అనుషా

పాలసముద్రం: మండల పరిధిలో ఉపాధి హామీ పథకంలో చేస్తున్న పనులు నాణ్యతగా చేయాలని ఇన్‌చార్జి ఏపీఓ అనుషా కోరారు. అముదాలలో శుక్రవారం ఆమె ఉపాధిహామీ కూలీలకు సమీక్ష సమావేశం నిర్వహించారు. కూలీలతో ఆమె మాట్లాడుతూ ఉపాధి హామీ పథకంలో చేస్తున్న పనులు నాణ్యతగా చేయాలని స్పష్టం చేశారు. కష్టపడి పనులు చేస్తున్న కూలీలు ఆన్‌లైన్‌లో హాజరు వేయాలని సూచించారు. రోజంతా కష్టపడి పని చేసిన ఫొటో తీయకపోతే బిల్లులు రావని తెలిపారు. ప్రస్తుతం ఎండల తీవ్రత ఎక్కువగా ఉండడం వల్ల ఉదయం వచ్చి మార్కింగ్ ఇచ్చిన కొలతల ప్రకారం పనులు పూర్తి చేయాలన్నారు.

క్యాన్సర్ నివారణ చర్యలు చేపట్టండి

తిరుపతి అర్బన్: క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలను పకడ్బందీగా చేపట్టి నివారణ చర్యలు చేపట్టాలని కలెక్టర్ కే.వెంకటరమణారెడ్డి ఆదేశించారు. ఆయన శుక్రవారం జిల్లా క్యాన్సర్ స్క్రీనింగ్ కమిటీ సమావేశంలో మాట్లాడారు. జిల్లాలోని 691 సచివాలయాల పరిధిలోని ఏఎన్ఎంలు, విలేజ్ హెల్త్ క్లినిక్ అసిస్టెంట్లకు 40 మంది వంతున సోమవారం నుంచి శనివారం వరకు శిక్షణ ఇవ్వాలన్నారు. టాటా క్యాన్సర్, స్విమ్స్ ఆసుపత్రుల సహకారంతో పింక్ బస్‌ల ద్వారా పరీక్షలు చేస్తున్నట్టు చెప్పారు. శ్రీకాళహస్తి, గూడూరు, చంద్రగిరి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు.

ఎల్లమ్మతల్లికి ప్రత్యేక అభిషేకాలు



అమ్మవారికి పొంగలి తీసుకొస్తున్న మహిళలు, విశేష అలంకరణలో ప్రత్యేక పూజలు, దీపారాధనలు అందుకున్న ఎల్లమ్మతల్లి

పాలసముద్రం: మండలంలోని క్రిష్ణజమ్మాపురం గ్రామంలో వెలసిన ఎల్లమ్మతల్లికి శుక్రవారం గ్రామస్తులు ప్రత్యేక అభిషేకాలు, పూజలు చేశారు. ఉదయం అమ్మవారిని పాలు, పెరుగు, తేనె, నెయ్యి చందనంతో వివిధ అభిషేకించారు. మధ్యాహ్నం ప్రతి ఇంటి నుంచి మహిళలు పొంగళ్ల, పూజసామగ్రిని పంబవాయిద్యాలతో గ్రామాల్లో ఊరేగించి, అమ్మవారి ఆలయ ఆవరణలో పొంగళ్లు పెట్టి, నైవేద్యం సమర్పించి, ప్రత్యేక దీపారాధన చేశారు. సాయంత్రం భక్తులు తీసుకొచ్చిన సుగంధన పుష్పాలతో అమ్మవారిని సుందరంగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. భక్తులు పిండి దీపాలు వెలిగించి కొబ్బరి కాయలు సమర్పించి, మొక్కులు చెల్లించుకున్నారు.

ప్రజల మధ్య.. ప్రజలతోనే..


లబ్ధిదారుకు బుక్‌లెట్ ఇస్తున్న మంత్రి ఆర్కేరోజా

- మంత్రి ఆర్కేరోజా

నగరి: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక నాలుగేళ్లుగా ప్రజల మధ్యే ఉంటూ వారి సమస్యలు పరిష్కరిస్తూ వారికి అండగా నిలబడుతున్నామని, తెలుగుదేశం పార్టీలా ప్రజలను విస్మరించలేదని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, యువజన సర్వీసుల, క్రీడాశాఖ మంత్రి ఆర్కేరోజా అన్నారు. శుక్రవారం మున్సిపల్ పరిధి 27వ వార్డు చింతపట్టెడ దళితవాడలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఆమె నిర్వహించారు. మంత్రి ఇంటింటికీ వెళ్లి ప్రజా సమస్యలు, సంక్షేమ పథకాల అమలుపై ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ఆయా కుటుంబాలు పొందిన పథకాల లబ్ధిని బుక్‌లెట్లతో వివరించారు. స్థానికులు ఆమె దృష్టికి తెచ్చిన సమస్యలకు సచివాలయ సిబ్బంది, సంబంధిత అధికారుల ద్వారా పరిష్కార మార్గం చూపారు. చిన్న చిన్న సమస్యలను సచివాలయ సిబ్బంది ఎప్పటికప్పుడు పరిశీలించి పరిష్కరించాలని, పరిధికి మించిన సమస్య ఉంటే తనదృష్టికి తేవాలని మంత్రి ఆదేశించారు. ఆమె మాట్లాడుతూ, ప్రజాసంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్న ప్రభుత్వానికి తిరిగి ప్రతి ఒక్కరూ మద్దతుగా నిలిచి అధికారంలోకి తీసుకురావాలన్నారు. ప్రజల విశ్వాసాన్ని కోల్పోయి ఎన్నికల్లో ఘోర పరాజయం పాలైన టీడీపీ చేస్తున్న దుష్ప్రచారాలను ఎవరూ నమ్మరాదని విజ్ఞప్తి చేశారు. గతంలో ప్రజా సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించిన టీడీపీ ఇప్పుడు చిలుక పలుకులు వల్లిస్తోందని అపహాస్యం చేశారు. నిత్యం ప్రజలతో మమేకమైన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని వచ్చే ఎన్నికల్లో మళ్లీ గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పీజీ నీలమేఘం, వైస్ చైర్మన్ బాలన్, రాష్ట్ర మొదలియార్ కార్పొరేషన్ డైరెక్టర్ బాలకృష్ణ, మున్సిపల్ పార్టీ అధ్యక్షులు బీఆర్వీ అయ్యప్పన్, మున్సిపల్ సచివాలయ కన్వీనర్ దయానిధి, మున్సిపల్ కమిషనర్ వెంకట్రామిరెడ్డి, తహసీల్దార్ చంద్రశేఖర్ రెడ్డి, హౌసింగ్ ఎస్ఈ శంకరప్ప, కౌన్సిలర్ గిరిజాకుమారి, పార్టీ నాయకులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు తదితరులు పాల్గొన్నారు.

నేడు మంత్రి పర్యటన

నగరి మండల, మున్సిపల్ పరిధిలో జరిగే కార్యక్రమాల్లో పర్యాటక శాఖ మంత్రి ఆర్కేరోజా శనివారం పాల్గొననున్నారు. ఉదయం 10 గంటలకు నగరి మండల ప్రజా పరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశం, సాయంత్రం 4.30 గంటలకు నగరి మున్సిపాలిటీ చింతల పట్టెడలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆమె పాల్గొంటారు.

సానుకూల దృక్పథంతో ఉన్నత స్థానాలకు..


సమావేశంలో మాట్లాడుతున్న రాజారామ్ కొల్లె

నగరి: సానుకూల దృక్పథం కలిగి ఉంటే ఉన్నత స్థానాలకు చేరవచ్చని వ్యక్తిత్వ వికాస నిపుణులు రాజారామ్ కొల్లె అన్నారు. నగరిలో ఉచితంగా నిర్వహిస్తున్న పినాకా తరగతుల్లో శుక్రవారం విద్యార్థులు, అభ్యర్థులకు ఆయన సలహాలు–సూచనలు ఇచ్చారు. ఒక లక్ష్యం నిర్దేశించుకుని దాని సాధనకు ఆత్మవిశ్వాసం, ధైర్యం, స్థిరచిత్తంతో ముందుకు పోవాలన్నారు. ఉన్నత స్థానాలకు చేరుకున్న వారి ఏడు అలవాట్లు అనే అంశంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. వాటిని జీవితానికి అన్వయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో రిసోర్స్ పర్సన్ బాలాజి, జనార్ధన్, సీడీ మునస్వామి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని ప్రచారం


26వ వార్డులో..


నెత్తం కండ్రిగలో..

నగరి: ప్రభుత్వ పాఠశాలల్లో అత్యున్నత బోధన అందిస్తున్నట్లు ప్రధానోపాధ్యాయులు రాధిక తెలిపారు. శుక్రవారం 26వ వార్డులో కౌన్సిలర్, ఉపాధ్యాయులు, సీఆర్పీలతో కలిసి ఆమె పర్యటించారు. బడిఈడు పిల్లలను గుర్తించి ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని తల్లిదండ్రులను కోరారు. ప్రభుత్వం నుంచి జగనన్న గోరు ముద్ద, జగనన్న విద్యాకానుక కిట్, పాఠ్యపుస్తకాలు ఇతర ప్రభుత్వ ప్రోత్సాహకాల గురించి వివరించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ ఇంద్రయ్య, వెల్ఫేర్ అసిస్టెంట్ శిరీష, సీఆర్పీ శ్రీవాణి తదితరులు పాల్గొన్నారు. ప్రధానోపాధ్యాయులు నాదముని నెత్తం కండ్రిగ ప్రాంతంలో ఇంటింటికీ వెళ్లి బడి ఈడు పిల్లలను బడిలో చేర్చాలంటూ ప్రచారం చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు మోహన్, సుమతి, కళావతి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

గిరిజనులకు సోలార్ ఉపకరణాలు పంపిణీ


సోలార్ ఉపకరణాలను అందుకుంటున్న గిరిజనులు

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని కాటూరు గ్రామపంచాయతీ లోని ఓటువాని గిరిజన కాలనీ, కాంపాళెం గ్రామ పంచాయతీలోని చల్లంవారి గిరిజన కాలనీలలోని 25 కుటుంబాలకు శుక్రవారం స్థానిక నవజీవన్ ఆర్గనైజేషన్ డైరెక్టర్ సహదేవయ్య ఆధ్వర్యంలో సౌర ఉపకరణాలను సర్పంచ్ చిరంజీవి, ఎంపీటీసీ సభ్యులు రవి చేతుల మీదుగా పంపిణీ చేశారు. సహదేవయ్య మాట్లాడుతూ, మారుమూల గిరిజన కాలనీలలో విద్యుత్ సౌకర్యం లేక గిరిజనులు ఇబ్బంది పడుతుండటం తమ సంస్థ గురించి, హ్యాపీటెక్ సంస్థ సౌజన్యంతో రూ. 20 వేల విలువ చేసే సోలార్ బ్యాటరీ, ప్యానెల్, రెండు లైట్లు, ఒక టేబుల్ ఫ్యాన్‌ను గిరిజనులకు ఉచితంగా పంపిణీ చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో సంస్థ కోశాధికారి శాంతకుమార్, వలంటీర్ శిరీష, కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఆలయ అభివృద్ధి పనులు వేగవంతం


గురు దక్షిణామూర్తి సన్నిధి వద్ద దేవదాయ కమిషనర్ సత్యనారాయణ, చైర్మన్, ఈఓ, అధికారులు

- దేవదాయ శాఖ కమిషనర్ ఆదేశం

తొట్టంబేడు(రేణిగుంట): శ్రీకాళహస్తీశ్వరస్వామి దేవస్థానంలో అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని రాష్ట్ర దేవదాయశాఖ కమిషనర్ ఎస్.సత్యనారాయణ ఆదేశించారు. శుక్రవారం ఆయన ముక్కంటి దర్శనార్థం వచ్చారు. దేవస్థానం చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు, ఈఓ సాగర్‌బాబు, ఆలయాధికారులు, వేదపండితులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ప్రత్యేక దర్శనానంతరం గురుదక్షిణామూర్తి సన్నిధి వద్ద వేదపండితులు ఆశీర్వచనం పలికారు. చైర్మన్ ఆయన్ను శేషవస్త్రంతో సత్కరించి స్వామి, అమ్మవారి చిత్రపటం, తీర్థప్రసాదాలను అందజేశారు.

కమిషనర్‌కు వినతులు

ఆలయాభివృద్ధికి మరింత సహకారం ఇవ్వాలని కమిషనర్‌ను అంజూరు కోరారు. ప్రధానంగా ఆలయ మాస్టర్ ప్లాన్ అమలుకు భూ సేకరణలో ఒక్క భవనం మాత్రమే మిగిలిపోయిందని, దానిని పూర్తి చేసి మాస్టర్ ప్లాన్ అమలు చేయాలని కోరారు. అలాగే విజ్ఞానగిరి కుమారస్వామి ఆలయం వద్ద నాలుగు ఇళ్ల భూసేకరణ చేయాలని, అలాగే గంగమ్మ గుడి ఆధునీకరణకు ఒక ఇల్లు సేకరణ చేసి పనులకు పూనుకోవాల్సి ఉందని వివరించారు. వీటికి పరిహారం త్వరగా మంజూరు చేయాలని కోరారు. అలాగే శ్రీ ప్రసన్న వరదరాజ స్వామి ఆలయం పునర్నిర్మాణ పనులు, ఇతర అభివృద్ధి పనులు వెంటనే పూర్తి చేసేలా సహకారం అందించాలని కోరారు. అనంతరం ఆయన ఆలయ ఇంజినీర్లతో చర్చించి అభివృద్ధి పనులపై ప్రతిపాదనలు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో దేవస్థానం ఏఈఓ సతీష్ మాలిక్, లోకేష్ రెడ్డి, కృష్ణారెడ్డి, ఈఈ మురళీధర్ రెడ్డి, డీఈ శ్రీనివాస్ రెడ్డి, సూపరింటెండెంట్ నాగభూషణం, దేవస్థాన ప్రధాన అర్చకులు కరుణాకర్ గురుకుల్, వేద పండితులు అర్ధగిరి, సంగమేశ్వశాస్త్రి శర్మ, రాజేష్ శర్మ, ఆలయ అధికారులు పాల్గొన్నారు.